కోర్ బ్రాంచ్‌లపైనే మౌలిక సదుపాయాల భవిష్యత్

● నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ చైర్మన్ సహస్రబుదే



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎన్‌బీఏ చైర్మన్ సహస్రబుదే, జేఎన్‌టీయూ వీసీ టీకేకే రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మౌలిక సదుపాయాల భవిష్యత్తు కోర్ బ్రాంచిలైన సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల పైనే ఆధారపడి ఉందని నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) చైర్మన్ అనిల్ సహస్రబుదే అన్నారు. బుధవారం జేఎన్‌టీయూ వాటర్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌బీఏ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వంతెనలు, రహదారులు, డ్యామ్స్ నిర్మించే సివిల్ ఇంజనీర్లు లేకపోతే వ్యవసాయం, నీటి వనరులకు ఇబ్బందులు తప్పవన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సును తొలగిస్తే టాటామోటార్స్, మారుతీ వంటి ఆటోమొబైల్ కంపెనీలకు ఇంజనీర్లను ఎక్కడి నుంచి తీసుకురావాలని ప్రశ్నించారు. సివిల్, మెకానికల్ కోర్సులపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్స్‌కు, జేఎన్‌టీయూ అధికారులకు సూచించారు. కోర్ బ్రాంచ్‌ల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు ఏఐ, డేటాసైన్స్ వంటి మైనర్ డిగ్రీలు పూర్తిచేస్తే.. కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు ఏఐసీటీఈ అనుమతిస్తుందన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు గుర్తింపు

విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు పూర్తిసమయం అందుబాట్లో ఉంటున్న కాంట్రాక్టు/అడ్‌హాక్ టీచింగ్ అసిస్టెంట్స్‌ను ఎన్‌బీఏ సెల్ఫ్ అసెస్‌మెంట్ రిపోర్టులో ఫ్యాకల్టీగానే పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్ ప్రకారం విద్యాసంస్థల నాణ్యతను మూల్యాంకనం చేయాల్సి ఉందన్నారు.

కన్సల్టెన్సీలను అప్రోచ్ కావొద్దు

ఎన్‌బీఏ అక్రిడిటేషన్ పోర్టల్‌లో డేటా ఫిల్లింగ్ కోసమని కాలేజీలు కన్సల్టెన్సీలను అప్రోచ్ కావాల్సిన అవసరం లేదని సహస్రబుదే స్పష్టం చేశారు. ఎన్‌బీఏ ఫార్మాట్లో అడిగిన డేటాను సమర్పిస్తే చాలన్నారు. భారత ప్రభుత్వం తీసుకువస్తున్న నేషనల్ డిజిటల్ ఆర్కిటెక్చర్ తరహా వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. కార్యక్రమంలో ఎన్‌బీఏ సభ్య కార్యదర్శి అనిల్‌కుమార్ నాసా, ఒడిశా ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఎస్ఎస్ పట్నాయక్, ఎంఎస్ రామయ్య యూనివర్సిటీ డీన్ రంగనాథ్, జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్ రెడ్డి, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు కామాక్షి ప్రసాద్, గిరిధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ విద్యుత్ బిల్లుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కమర్షియల్ విద్యుత్ బిల్లుల వసూళ్లకు దక్షిణ డిస్కం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రంగారెడ్డి జోన్‌లో పాతబకాయిల వసూళ్లు, అండర్ డిస్ కనెక్షన్లు, కమర్షియల్ బిల్లుల వసూళ్లకు రంగారెడ్డి జోన్ డీఈటీ కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నోడల్ టీమ్‌ను నియమించారు. నోడల్ టీంలో అసిస్టెంట్ అకౌంట్‌ఆఫీసర్, స్థానిక ఏడీఈ సభ్యులుగా ఉంటారు. బుధవారం బకాయిల వసూళ్లకు కాటేదాన్ తదితర ప్రాంతాల్లో స్థానిక ఆపరేషన్ వింగ్ ఇంజనీర్లతో కలిసి కమర్షియల్, కేటగిరి 3 సర్వీసులు పరిశీలించడంతో పాటు పాత బకాయిలు చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. పలువురి నుంచి బకాయిలు వసూలు చేశారు. విద్యుత్ చౌర్యం, మీటర్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సినిమా నిర్మాణంలో కాస్ట్యూమ్స్ డిజైనింగ్ కీలక పాత్ర



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సినిమా నిర్మాణంలో కాస్ట్యూమ్స్ డిజైనింగ్ కీలక పాత్ర పోషిస్తుందని సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నితన్ ఆధ్వర్యంలో 'కాస్ట్యూమ్స్ డిజైన్ ఇన్ సినిమా వర్క్‌షాప్'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాపును ఔత్సాహిక సినీ ప్రేమికులు వినియోగించుకోవాలన్నారు. సినిమా రంగంలో అనేక విభాగాల్లో కాస్ట్యూమ్స్ డిజైనింగ్ ఒకటని అయితే సినిమా నిర్మాణంలో ఇది అత్యంత ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. చిన్న సినిమా, పెద్ద సినిమా అనకుండా అన్ని సినిమాల్లో కథకు తగినట్లు కాస్ట్యూమ్స్ ఉంటేనే సినిమా విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీపాద్ మాచర్ల, అక్షరకుమార్ తదితరులు పాల్గొని నిర్వాహకుడు నితిన్‌రెడ్డిని సత్కరించి అభినందించారు.

హెచ్-సిటీ పనులకు భూసేకరణ పూర్తి చేయండి



అధికారులతో కలిసి మ్యాప్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హెచ్-సిటీ పనులు ప్రారంభించేందుకు కావాల్సిన భూ సేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ జోన్‌లో పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పాటిగడ్డ ఆర్‌ఓబీ, రసూల్ పుర ఫ్లైఓవర్, ఏఓసి చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం, ఆర్‌కేపురం, చిలకలగూడ ఆర్‌యూబీ పనులకు స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ రోహిణి, టౌన్ ప్లానింగ్ అధికారులు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్ పాల్గొన్నారు.

నేడు, రేపు ఎంసీహెచ్‌ఆర్డీలో ప్రిజన్ కాన్ఫరెన్స్



జాతీయ ప్రిజన్ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ ఐజీ నరసింహ తదితరులు

పంజాగుట్ట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రిజన్ సంస్థ ఆధ్వర్యంలో జైళ్లను పరివర్తన కేంద్రాలుగా ఏ విధంగా తీర్చిదిద్దాలి అనే అంశంపై దేశంలోనే మొట్టమొదటిసారిగా రెండు రోజుల పాటు నేషనల్ ప్రిజన్ కాన్ఫరెన్స్-2025 జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవనరుల అభివృద్ధి సంస్థలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన జైళ్ల శాఖ అధికారులు, సీనియర్ ఐపీఎస్ అధికారులు, విద్యావంతులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు తదితరులు పాల్గొంటారని రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ ఐజీ, ప్రిజన్ వరల్డ్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎ.నరసింహ తెలిపారు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను సంస్థ సభ్యులు ఎ.అశోక్‌కుమార్, బినీత్ సింగ్, ఎల్.ఎం.చౌదరి,వినోద లక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. సదస్సును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారని, రెండో రోజు ముగింపు సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. డీజీపీ జితేందర్, సంస్థ అధ్యక్షుడు, రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ డీజీ వీకే సింగ్ తదితరులు హాజరవుతారని ఆయన చెప్పారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

● పకడ్బందీగా ఏర్పాట్లు
● విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన
● సీసీ కెమెరాల నీడలో ఎగ్జామ్స్



లకోటియా సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల

అంబర్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో హిమాయత్‌నగర్ జోన్ పరిధిలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అంబర్‌పేట, హిమాయత్‌నగర్ మండలాల్లో మొత్తం 4,892 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. 13 ప్రభుత్వ పాఠశాలల నుంచి 528 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల నుంచి 4, 364 విద్యార్థులు పరీక్షలకు కూర్చుంటారు. మొత్తం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సమయం ఉంటుందని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఎవరికీ సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచిస్తున్నారు. ఐదు నిమిషాల ఆలస్యమైనా అనుమతిస్తామని తెలిపారు. ఆయా సెంటర్ల పరిధిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సదుపాయాలు కల్పించాం



పరీక్షకు వచ్చే విద్యార్థుల కోసం అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశాం. ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేశాం. మౌలిక సదుపాయాలను కల్పించాం. విద్యార్థులు ఎలాంటి తడబాటుకు గురికాకుండా ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి.

- ఆస్రా ఫాతీమా, హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ డీఈవో

నటులకు భాష, అభినయం, రూపం ప్రధానం

చిక్కడపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టీవీ, సినీ నటులకు భాష, అభినయం, రూపం ప్రధానం అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు పి. విజయబాబు అన్నారు. అభినందన మహిళా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో అభినందన సీల్‌వెల్ టీవీ పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. ఉత్తమ కుటుంబకథా చిత్రాలు దర్శకుడు రాధాకృష్ణతోపాటు నటీనటులుకు అవార్డ్స్ ప్రదానం చేశారు.

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తం చేశారు. ఆయా ప్రజా, సేవా సంఘాలు నేతలు, రాజకీయల నేతలు అభిప్రాయాలు తెలిపారు. అధికార పార్టీ నేతలు సంక్షేమ బడ్జెట్ అంటుండగా.. ప్రతిపక్షం పెదవి విరుస్తున్నది.

ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం, మార్చి19(ఆంధ్రజ్యోతి):

సంక్షేమానికి పెద్దపీట



బడ్జెట్ పేద వర్గాలను ఆకట్టుకునేలా ఉంది. అన్ని రంగాల వారికి న్యాయం కల్పించేలా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఇందులో నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమం కోసం అనుకూలంగా ఉంది.

-ప్రొఫెసర్ సులోచన

• మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం



మహిళల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఉచిత బస్సు ప్రయాణానికి నిధులు కేటాయించడంతోపాటు మహిళల స్వయం సంవృద్ధి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం వంటి పథకాలలో వాటా కల్పిస్తూ బడ్జెట్ కేటాయించడం వల్ల ఆర్థిక ప్రగతి సాధిస్తారు.

- శంభుల ఉషశ్రీ, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు

•ఢిల్లీ పెద్దలకు మూటలు పంపే బడ్జెట్



బడ్జెట్ పేద ప్రజల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ నేతలకు మూటలు పంపే బడ్జెట్ ఇది. కొత్త సీసాలో పాత సీరా అన్నట్లుగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ నిధులు కేటాయించలేదు. అభివృద్ధి, సంక్షేమ రంగానికి నిధుల కేటాయింపులో తగిన ప్రాధాన్యత కల్పించలేదు. అన్ని వర్గాలను మోసం చేసే బడ్జెట్.

- ముఠా గోపాల్, ముషీరాబాద్ ఎమ్మెల్యే

• యువతకు మేలు



యువతకు ఉపాధి కల్పన ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం 4 లక్షల రూపాయల రుణ సహకారం అందిస్తారు. దీంతో 60 శాతం సబ్సిడీ అవకాశం కల్పిస్తుండటం బాగుంది. బడ్జెట్‌లో 700 కోట్లు కేటాయించడం ఎంతో మేలు.

టీ కృష్ణగౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి

• పేదల ఆకాంక్ష విస్మరించారు



పేదలకు ఉపయోగం లేని బడ్జెట్ ఇది. పేద, మధ్యతరగతి వర్గాలకు నిర్లక్ష్యం చేశారు. పేదల ఆకాంక్షలను విస్మరించింది కాంగ్రెస్ ప్రభుత్వం.

-నాగభూషణంచారి, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు

• దేశానికే రోల్‌మోడల్



బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది. అన్ని వర్గాలకు బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించారు. విద్యా, వైద్య, క్రీడా, వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు.

డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి, కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి

• ప్రజలను మభ్యపెట్టేలా ఉంది



ఇది ప్రజల బడ్జెట్ కాదు. కేవలం గాంధీభవన్ బడ్జెట్ మాత్రమే. ఈ బడ్జెట్‌ను ఏ వర్గం ప్రజలు కూడా ఆమోదించడం లేదు. ఎన్నిలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో ఏ ఒక్క దానికి కూడా సరైన రీతిలో బడ్జెట్ కేటాయించలేదు. ప్రజలను మభ్యపెట్టడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఏ రంగానికి కూడా సరైనరీతిలో నిధులు కేటాయించలేదు. అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు.

- కాలేరు వెంకటేష్, అంబర్‌పేట ఎమ్మెల్యే

• అభినందనీయం



అన్ని వర్గాల సంక్షేమం బడ్జెట్. అన్ని రంగాలకు వాటి ప్రాధాన్యత, ప్రజావసరాలను నిధులు కేటాయించారు. ఎన్నికల హామీల అమలుకు నిధుల కేటాయింపు అభినందనీయం.

- జి.నాగభూషణం, రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి బోర్డు మాజీ చైర్మన్

• ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఏది?



ప్రజారోగ్య భద్రతకు సరైన ప్రాధాన్యత లభించలేదు. రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో 4 శాతం మాత్రమే, ఇది జాతీయ ఆరోగ్య విధానం 2017 ప్రకారం కనీసం 8 శాతం ఉండాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ్‌రెడ్డి, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

• నిరుద్యోగ యువతకు లబ్ధి



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. రైతన్నలు, మహిళలకు. నిరుద్యోగ యువతకు ఉపాధి లబ్ధి చేకూరేలా ఉంది.

ఎన్.అజయ్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి

• మరోసారి మోసం



అన్ని వర్గాల ప్రజలు ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నారు. అనేక అంశాలను పరిగణలోకి తీసుకోలేదు. ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ఏ వర్గానికి న్యాయం చేయకుండా ప్రభుత్వం మరోసారి మోసానికి పాల్పడింది.

- డాక్టర్ గౌతమ్‌రావు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు

ఘటనలకు అక్షరరూపం 'శ్రీరమణ అనుగ్రహ తరంగములు'

చిక్కడపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రమణ మహర్షి సందేశాలను మణులమాలగా సుబ్బారావు రమణ అనుగ్రహ తరంగాలు పేరిట రచించి ప్రజలకు ఆయన తాత్వికతను పరిచయం చేశారని ప్రముఖ కథకుడు రాయసం వెంకట్రామయ్య అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, నృత్య కిన్నెర ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో డాక్టర్ మద్దాలి సుబ్బారావు రచించిన శ్రీరమణ అనుగ్రహ తరంగములు గ్రంథావిష్కరణ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన రాయసం వెంకట్రామయ్య మాట్లాడుతూ సుబ్బారావు రమణమహర్షి ఆశ్రమంలోఉండి తాను స్వయంగా అనుభూతి పొందిన సంఘటనలను అక్షరరూపంలో తెచ్చారన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ప్రసంగించారు. అధ్యక్షత వహించిన నవలారచయిత ఆచార్య శివప్రసాద్, రఘురామ్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహనం

చిక్కడపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె. వెంకట్, ఎం. అడివయ్యలు మాట్లాడారు. ప్రభుత్వం బడ్జెట్‌లో దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమానికి పైసా కూడా కేటాయించలేదన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి ప్రత్యేకంగా దివ్యాంగులకు సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలన్నారు. ఆసరా పెన్షన్‌ల పెంపునకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రమోహన్, మల్లేష్, సుల్తాన్ రమేష్, జానీరాజు, శివకుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్

ముషీరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రిటైర్డ్ లెక్చరర్ కమలాదేశ్‌పాండే అన్నారు. బుధవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఏవీ నాగనాథ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమలాదేశ్‌పాండే మాట్లాడారు. 10వ తరగతి ఉన్నత చదువులకు పునాది లాంటిదన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు.



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న కమలాదేశ్‌పాండే, విద్యా మండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం

రాంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ గౌడ కల్లు గీత సమన్వయ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యోలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నివాసంలో కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

రాంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో రూపొందించిన వర్ధంతి పోస్టర్‌ను బుధవారం బాగ్ లింగంపల్లిలో మంత్రి సీతక్క, సినీ నటుడు డాక్టర్ మాదాల రవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు ఎం.డి.జావేద్, అశోక్‌రెడ్డి, కోటరమేష్, వెంకటేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రాంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బిల్లుకు మంత్రివర్గం ఆమోదించడంపై బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యులు రఘు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బుధవారం గాంధీనగర్ కొత్త బ్రిడ్జి చౌరస్తాలో కార్యక్రమం జరిగింది. రాజీవ్‌గాంధీ సంఘటన్ కన్వీనర్ గుర్రం శంకర్ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అత్యుత రమేష్‌బాబు, బాబీ, గిరి, నవీన్, విక్కి, బబ్లూ, నర్సింగ్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి : బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ సీనియర్ బీసీ నేత బింగి సాయికీర్త్(బాబీ) ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. సాయికీర్త్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల రాజకీయంగా బీసీలకు మరింత ప్రాధాన్యత దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, న్యాయవాది డి. బానుచందర్, విక్కీ, రమేష్, గుండు జగదీశ్, మనోజ్, గిరి, శంకర్, నవీన, దేవి, ప్రసాద్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీసత్యసాయి అవతార శతాబ్ది వేడుకల సందర్భంగా 10 లక్షల శ్రీసత్యసాయి ఫొటోల పంపిణీ కార్యక్రమం బుధవారం విద్యానగర్‌లోని శివంలో జరిగింది. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, మాజీ డీజీపీ, సత్యసాయి ట్రస్ట్ ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ హెచ్.జె.దొర, కన్వీనర్ కోటేశ్వరరావు, అధ్యక్షుడు వెంకట్రావు, నగర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, 31 జిల్లాల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఓసీల్లోని పేదలకు రాజీవ్ యువ వికాసం వర్తింపజేయాలి



మాట్లాడుతున్న రామారావు

నల్లకుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగ యువతతోపాటు ఆర్థికంగా వెనుకబడిన ఓసీ సామాజిక, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి కూడా కార్పొరేషన్ల ద్వారా రుణ సదుపాయాన్ని వర్తింప చేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. బుధవారం హైదర్‌గూడలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓసీల్లోని పేదలకు ఆర్థిక, సంక్షేమ చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం ఓసీల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు.

సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడిగా ఈశ్వర్

బర్కత్ పుర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జి. ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండలి కార్యాలయంలో జరిగిన జాయింట్ కమిటీ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోగా మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. కార్యక్రమంలో సేవా మంగలి గ్రేటర్ అధ్యక్షుడు బి.నర్సింగరావు. రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి బి. సత్యేంద్ర కృష్ణ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం వెళ్తుండగా జారి పడిన సామగ్రి

● ఇద్దరికి గాయాలు

కవాడిగూడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డీసీఎం వ్యాన్ నుంచి సామగ్రి మీద పడి స్కూల్ విద్యార్థిని, ద్విచక్రదారుడు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. బోలక్‌పూర్ వైపు నుంచి ఎస్‌బీఐ కాలనీ మీదుగా అశోక్‌నగర్‌వైపునకు డీసీఎం వెళుతోంది. అయితే ఎస్‌బీఐ కాలనీ పాఠశాల విద్యార్థినికి కుర్చీ తగిలి తలకు గాయమైంది. బైకిస్టుపై రేకు పడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం వారు గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

● ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి



మాట్లాడుతున్న రామానుజులరెడ్డి

రాంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆధార్‌తో ఓటరు అనుసంధాన కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సర్కిల్‌కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ ఆధార్‌తో ఓటరు అనుసంధాన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, తిరుమలరావు, బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రామ్, బీఆర్ఎస్ నాయకులు కె.మాధవ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, అధికారులు సునందదేవి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.